# “అసాధారణ వ్యక్తుల మధ్య నేను పెరిగాను”

అలైదా గువెరా మార్చి

**అలైదా గువెరా మార్చి-లాటిన్ అమెరికా విప్లవ నాయకుడు చేగువెరా కుమార్తె, శిశు వైద్యురాలు, వైద్య అధ్యాపకురాలు, అలాగే వైకల్యం కలిగిన బాలల ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలు. క్యూబా కమ్యూనిస్టు పార్టీ సభ్యురాలు. ఫ్రీలాన్స్ జర్నలిస్టు రాన్ అగస్టీన్‌కు ఆమె బ్రస్సెల్స్‌లో ఇచ్చిన ముఖాముఖి యిది. 'మంత్లీ రివ్యూ' పత్రిక నుండి అనువదించాము.**

**- సంపాదకుడు**



**ప్రశ్న : కాస్ట్రో 90వ జన్మదినం సందర్భంగా, కాస్ట్రోకు, గువెరాకు వివాదాల గురించీ, మీ నాన్న సోవియటు యూనియన్‌ను విమర్శించటం వంటి పలు అంశాలపై పశ్చిమ దేశాల మీడియా చరిత్ర వక్రీకరణకు పూనుకుంది. ఇలాంటి వక్రీకరణలను మీరు, మేము అనేకసార్లు చూశాం. అయి నప్పటికీ మీరు దీనిపైన వ్యాఖ్యానిస్తారా; వీటి గురించి ఎప్పుడైనా కాస్ట్రోతో చర్చించారా?**

**జవాబు :** ఫైడల్ కాస్ట్రో, మా నాన్న మెక్సికోలో కలిసారు. క్యూబా విప్లవంలో చేరేందుకు మా నాన్న ఒక షరతు పెట్టారు. క్యూబా విప్లవం విజయ వంతమై, తాను బ్రతికి వుంటే, తనకు నచ్చిన రీతిలో వెళతానని. విప్లవ విజయం తర్వాత క్యూబా సోషలిస్టు సమాజ నిర్మాణంలో నాన్న ముఖ్య నాయకుల్లో ఒకడిగా వున్నాడు. ఆయనకు ఆస్తమా వుంది. గెరిల్లాగా తను అనుభవాన్ని పంచుకోవటానికీ, అమలుపరచడానికీ తనకు కొద్దికాలమే మిగిలిందని భావించాడు. అర్జెంటీనాలో అవకాశాలెలా వున్నాయో చూశాడు. అప్పటికి చాలా తక్కువగా వున్నాయి. కాంగో విముక్తి ఉద్యమం నుంచి సహాయ మందించమని వచ్చిన లేఖను ఫైడల్ నాన్నకు చూపించారు. లుముంబా హత్య తర్వాత బెల్జియం సైన్యం తిరిగి ఆధిపత్యం పొందేందుకు పూను కోవటంతో అక్కడి పరిస్థితి క్లిష్టంగా వుంది. దానితో క్యూబా విప్లవం సహాయమందించాలన్న వత్తిడి ఆఫ్రికా నుండి వచ్చింది. అక్కడికి వెళ్లేందుకు మా నాన్న, ఒక బ్రిగేడు వాలంటీర్లు ఎంతో ఆనంద పడ్డారు. నాన్న బయట కన్పించటం ఆగిపోగానే ఫైడల్‌కూ చే కూ వివాదాలంటూ ఇందాక మీరన్న ప్రచారాలు సాగాయి.

ఈ అంశాన్ని నేను ఫైడల్‌తో ప్రస్తావించాను. “మీకూ నాన్నకూ మధ్య వున్నాయంటున్న వివాదాల గురించి చెప్పండంకుల్” అని అడిగాను. ఆయన పెద్దగా నవ్వి వారిద్దరి మధ్యావున్న ఒక వివాదం గురించి చెప్పారు. అప్పుడు వాళ్లిద్దరు మెక్సికోలో జైల్లో వున్నారు. తమ రాజకీయాల గురించి మెక్సికో అధికారులకు చెప్పవద్దని ఫైడల్ అందరితోనూ చెప్పారు. “మీ నాన్నేం చేశాడో తెలుసా. తానే కమ్యూనిస్టునని చెప్పుకోవటంతోపాటు, స్టాలిన్ వ్యక్తిత్వం గురించి వాళ్లతో చర్చించాడు. దీనితో మమ్మల్నందరినీ వదలిపెట్టి, సోవియటు కమ్యూనిస్టని మీ నాన్న ఒకడినే జైల్లో అట్టిపెట్టారు”. మరి ఫైడల్ ఏం చేశాడు? నాన్నకు మద్దతుగా నిలిచి, ఆయనను వదలిపెడితే తప్ప తాను బయటకు వెళ్లేదిలేదని పట్టుపట్టాడు. ఫైడల్ ఇలా అన్నాడు: “అదే నేను చేయగలిగింది. ప్రాణం పోయినాసరే రాజకీయాల్లో అబద్ధమాడటం మీ నాన్నకు చేతకాదని నాకర్థమైంది. ఎంతవాదించినా ఆయన్ని ఒప్పించలేం”. వారి మధ్య వివాదాలు ఇలాంటివే. వారికి ఒకే ఆదర్శం, ఒకే సూత్రం వుండటంతో కలిసే పనిచేశారు.

ఆఫ్రికాలో పని ఎనిమిది నెలలు సాగింది. ఆ కాలంలో నాన్న, ఫైడల్‌ల మధ్య అన్ని విషయాలు చర్చించారనీ, వారికి క్యూబా నుండి పూర్తి సహాయ మందిందనీ క్యూబా డాక్యుమెంట్లు చూపు తున్నాయి. 1965 అక్టోబరులో క్యూబా కమ్యూనిస్టు పార్టీ అధికారికంగా ఏర్పడింది. పార్టీ కేంద్రకమిటి సభ్యులను ప్రకటించాల్సిన సమయంలో, క్యూబా విప్లవంలో ప్రముఖుడైన నాన్న ఎందుకులేరో ప్రజలకు వివరించటం ఫైడల్‌కు కష్టమైంది. తప్పని సరై నాన్న వీడ్కోలు లేఖను చదివారు. కాంగో నుండి వచ్చిన తర్వాత నాన్న ప్రేగ్ (బల్గేరియా)లో కొన్నాళ్లున్నారు. అప్పటికే ప్రజలకు వీడ్కోలు చెప్పారు గనుక తిరిగి క్యూబా రాదలుచుకోలేదు. అక్కడినుండే లాటిన్ అమెరికాకు సన్నాహాలు ప్రారంభించారు. అన్ని సన్నాహాలు క్యూబాలోనే బాగా చేయగలమని ఫైడల్ ఒప్పించటంతో రహస్యంగా క్యూబాకు తిరిగి వచ్చారు. ఒక రహస్య ప్రదేశంలో కొన్ని నెలలుండి కొలంబియా వెళ్లేందుకు మిగిలిన వారితో కలిసి అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ ఏర్పాట్ల అన్ని దశల్లో ఫైడల్ పాలుపంచుకున్నారు.

ఒక విషయాన్ని పదేపదే లేవనెత్తారు. బొలీవియాలో చే గ్రూపుని వంటరిగా వదలి వేశారన్నది. గెరిల్లా యుద్ధాన్ని సైనిక యుద్ధంతో పోల్చరాదు. నిలద్రొక్కుకోవటానికీ, అభివృద్ధి చెందటానికి గెరిల్లా దళం స్వతంత్రంగానూ, స్వయం పోషకంగానూ

వుండాలి. అయితే బొలీవియా పార్టీతో సంబంధాలు దిగజారాయి. వారితో సమాచార సంబంధాలు తెగిపోయాయి. వీలయినంతకాలం క్యూబాతో సంబంధాలు కొనసాగాయని చే రాసిన డెయిరీ చూస్తే తెలుస్తుంది. అందులో క్యూబాకు బదులుగా మనీలా అన్న పదం చే వాడారు. ఆయన డైరీ, దానికి ఫైడల్ రాసిన ముందుమాట వాస్తవికంగా సాధ్యపడేదానికున్న పరిమితులను చెప్పాయి.

నాన్న కాంగోలో వ్రాసిన డైరీకి ముగింపు పలుకులు వ్రాసే సందర్భంగా ఫైడల్‌తో నేను చర్చించాను. బొలీవియాకు వెళ్లే సన్నాహాలకు క్యూబాకు రమ్మని నాన్నను కోరుతూ ఫైడల్ రాసిన లేఖను ప్రచురించడానికి ఆయన ఒప్పుకున్నారు. వారి మధ్య విభేదాల గురించి చర్చిస్తున్నప్పుడు హఠాత్తుగా నా వైపు చూసి "ఎందుకు నవ్వుతున్నావ"ని ఫైడల్ అడిగారు. "అంకుల్, నాన్న గురించి మాట్లాడే టప్పుడు ఆయన ఇంకా బ్రతికి వున్నట్లే వర్తమాన కాలంలో మీరు మాట్లాడుతున్నారు" అన్నాను. ఆయన గంభీర స్వరంతో "మీ నాన్న వున్నాడు నీకు తెలుసా" అన్నారు.

మా నాన్నను అభిమానించే వారందరికీ ఆయన మానవీయ స్వభావం కూడా తెలియాలి. ఒక మనిషిగా ఆయన సున్నితత్వం తెలియాలి. ఫైడల్‌తోనో, క్యూబన్ విప్లవంతోనో ఆయనకు మౌలిక విభేధాలే వుండి వుంటే, తన భార్యా, పిల్లల బాధ్యతనూ, వారికి చదువుచెప్పి, మంచిగా తీర్చిదిద్దే పనిని వారి చేతిలోనే పెడతారని ఎవరైనా వూహించ గలరా? వీరిద్దరి మధ్యన తీవ్ర విభేధాలున్నాయని ఎవరైనా ఎలా నమ్మగలుగుతారు? దీనంత బుద్ధి తక్కువ పనుండదు. అయితే ఇలాంటి వక్రీకరణల వెనుకనున్న సైద్ధాంతిక ఉద్దేశ్యాలను మనం గమనించాలి. ఎందుకంటే నానా చెత్తను మనపై కుమ్మరిస్తున్న ప్రపంచంలో మనం జీవిస్తున్నాం.

అల్జీర్స్‌లో నాన్న చేసిన ప్రసిద్ధ ఉపన్యాసంలో ఆనాటి జాతీయ విమోచనోద్యమాలకు తగినంత మద్దతు ఇవ్వనందుకు సోషలిస్టు సోవియటు యూనియన్‌ను విమర్శించారు. వలసాధిపత్యం నుంచి బయటపడుతున్న ప్రతి దేశమూ సామ్రాజ్య వాదానికి పునాదిగా వుండదనీ, అలా సామ్రాజ్యవాద ఆధిపత్యానికి బయటవున్నంతవరకూ, వాటికి సోషలిస్టు ఆశయం వున్నా, లేకపోయినా జాతీయ విముక్తి ఉద్యమాలకు మద్దతు నందించి తీరాలనీ ఆయన వివరించారు. ఆనాడు క్యూబా నాయకత్వాని కున్న విశ్వాసానికి పూర్తి అనుగుణంగా నాన్న ఉపన్యాసం వుందనీ, ఆ విశ్వాసాలను మేమెప్పుడూ రహస్యంగా వుంచలేదనీ ఫైడల్ చెప్పారు.

**ప్రశ్న : మీ అమ్మ చెగువెరా అధ్యయన కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. మీ నాన్న చరిత్రకు చెందిన డాక్యుమెంట్లు అక్కడున్నాయి. మీ సోదరుడి సహకారంతో అనేక చారిత్రక ప్రాధాన్యతగల డాక్యుమెంట్లను ప్రచురణకోసం ఆమె సిద్ధం చేశారు. అమెకిప్పుడు 80 ఏళ్లు దాటాయి. ఎలా వున్నారావిడ? మరికొన్ని డాక్యుమెంట్లు వస్తాయా?**

**జవాబు :** అమ్మ ఇప్పటికీ చురుకుగానే వుంది. స్వయంగా కారు నడుపుకుంటూ ప్రతిరోజూ కేంద్రానికి వెళుతున్నది. ఓషన్‌సుర్, ఓషన్ ప్రెస్‌లతో కలిసి 16 పుస్తకాలు ప్రచురించాము. అనేక పుస్తకాలలో నాన్న గురించిన రిపోర్టులు కూడా వున్నాయి. ఇవన్నీ చే జీవితంలో ఈనాటికీ ప్రాసంగికత కలిగి వున్నవే.

**ప్రశ్న: ఎస్కాంబరే పర్వతాలలో గెరిల్లా యుద్ధం సాగుతున్నప్పుడు మీ తల్లిదండ్రులు కలిశారు. చే వెళ్లిన తర్వాత ఫైడల్ మీ రెండవ తండ్రి అయ్యారు. క్యూబా విప్లవ ప్రముఖులలో ఇంకెవరివద్ద మీరు పెరిగారు. సిలియా సాంఛెజ్, విల్మా ఎస్పిన్, హైడిన్ సాంతమనా, మెల్బా హెర్నాండెజ్ వంటి అసాధారణ మహిళ లున్నారు. వారి గురించి ఏమైనా చెప్పగలరా?**

**జవాబు :** నా చిన్నతనంలో నా తల్లే ప్రముఖ వ్యక్తి. విప్లవ విజయం తర్వాత క్యూబా మహిళా సమాఖ్యలో పనిచేసేవారు. అక్కడే సిలియా, విల్మా, హైడిన్, మెల్బాలు కూడా వుండేవారు. చిన్నతనంనుండీ నేను వీరందరి మధ్యా పెరిగాను. వీరందరినీ ఆంటీలుగానే చూశాను.

సిలియా బలమైన వ్యక్తిత్వం గలది. ఎప్పుడూ నిష్పాక్షికంగానే వుండేది. ఆవిడకు పిల్లల్లేరు. మా పిన్ని జర్నలిస్టు. రోజుల కొద్దీ ప్రయాణంలో వుంటే, పిన్ని కూతురును ఆవిడే పెంచింది. మా చదువులూ, రక్షణా అన్నీ చూసుకోవటంతోపాటు మేమందరం (అక్క, చెల్లి, నేనూ) సన్నిహితంగా వుండేలా చూసేది. ఆ కాలపు తీపి జ్ఞాపకాలు చాలా వున్నాయి. నాన్న మరణవార్త తెలిసేటప్పటికి, మేమంతా ఒకే యింట్లో వుండేవాళ్లం. మా అమ్మ కిష్టమైన మొక్కజొన్న జావ నా చేతికిచ్చి అమ్మగదిలో నీకోసం చూస్తున్నది వెళ్లమని సిలియా చెప్పింది. మరపురాని క్షణం అది. నా తండ్రి ఇకలేరని విన్న క్షణమది. ఆ సమయాన్ని సిలియా నుంచి విడదీసి చూడలేను. అలా ఆమె వద్ద పెరిగాను.

విల్మా తన పిల్లల్లో ఒక దానిగానే నన్ను చూసేది. ఆవిడ చిన్న కొడుకు రవుల్‌కు నేను అక్కని. ఆటపాటలతో మేము కలిసే పెరిగాం. విల్మా అంటే ఎంతిష్టమో, హైడీన్ అన్నా అంతే యిష్టం. ఆవిడ నిబద్ధత, నిశ్చయం, తక్షణ స్పందన నుండి నేర్చుకున్నాను. హైడీ చిన్న కుటుంబం నుండి వచ్చింది. స్కూలు విద్య తక్కువ. కానీ ఆశ్చర్యకర స్థాయిలో జ్ఞానాన్నీ, సంస్కారాన్నీ కలిగి వుండేది. ఆ కాలంలో అత్యంత ధీశాలి ఆమె. 'కాసాడిలాస్ అమెరికా' అన్న సంస్థ ఏర్పాటులో ఆవిధంగా లాటిన్ అమెరికాలోని మేధావులందరినీ సమీకరించటంలో అద్వితీయమైన పాత్ర ఆమెది. అయితే మొంకాడా దాడిలో ఆమెను, ఆమె తమ్ముడిని బంధించారు. చిత్రహింసలు పెట్టి ముక్కలుగా నరికిన అన్న శవాన్ని చూపించారు. ఇది ఆమెపై చెరగని ముద్రవేసింది. చాలా ఏళ్లు ఈ కష్టాన్ని దిగమింగి ధీరురాలిగానే వుంది. ఇక భరించలేని స్థితిలో జీవితానికి ముగింపు పలికింది.

మెల్బాతో కొన్నాళ్లు కలిసివున్నాను. ఆ సమయంలో మూడు ఖండాల సదస్సును ఆమె నిర్వహించింది. తరువాత వియత్నాంకు రాయబారిగా వెళ్లింది. జీవితాంతం వరకూ విప్లవానికే కట్టుబడిన చాలా సున్నితత్వం, తెలివిగల, చురుకైన మహిళ.

ఈ అసాధారణ మహిళల మధ్య నేను పెరిగాను. క్యూబా ప్రజలకు గల బలాన్నీ, మృదుత్వాన్నీ, దయార్ద్రతనూ, సంఘీభావాన్నీ వీరినుండి తెలుసు కోగలం. ఇది నాకు ఒక చక్కని అవకాశం. వారు మాకు బోధించింది మమ్ములను మంచి మనుషులుగా చేసింది.

ప్రజలనెలా గౌరవించాలో, వారికే ఎలా కట్టుబడి వుండాలో వీరు మనకు నేర్పుతారు. నాకు తెలిసిన పరిపూర్ణ క్యూబా మహిళలు వీరు. ఈ ప్రశ్న ఇంతకుముందు నన్నెవరూ అడగలేదు. వారు విప్లవానికి స్థంభాలు. క్యూబా మహిళలకు మార్గదర్శులు.

**పశ్న : 2016 జులైలో రాయబారుల ఏర్పాటును క్యూబా – అమెరికా సంబంధాల పునరుద్ధరణకు మొదటి అడుగుగా చూస్తున్నారు. క్యూబాపై చుట్టివేత ఆంక్షలకు సంబంధించి ఎలాంటి మార్పులేదు. జరగబోయేదేమిటి?**

**జవాబు :** గువాంటనామా ఆక్రమణ, చుట్టివేత, సాగివేత వున్నంతకాలమూ సాధారణ సంబంధాలు ఏర్పడవు. అమెరికాకు సంబంధించినంతవరకూ విధానంలో మార్పేమీ లేదు. చుట్టివేత లక్ష్యమైన క్యూబాలో సోషలిజాన్ని నాశనం చేయటంలో వైఫల్యాన్ని అమెరికా అంగీకరించింది. కనుక "మరొకటేదో చెయ్యాలి" కాబట్టి "క్యూబా ప్రజల్ని ప్రభుత్వంనుండి మరింత స్వతంత్రులను చేయండి" అంటున్నారు. అమెరికా అనుకున్న చుట్టివేత చెయ్య లేకపోయింది గానీ చాలా నష్టాన్ని కలుగజేసింది. ప్రతి ఏడూ జిడిపిలో 10శాతం నష్టాన్ని కలుగ జేసిందని అంచనా. ఒక వైద్యురాలిగా దీని పర్యవసానాలు నాకు ప్రతిరోజూ ఎదురయ్యాయి.

మాకు ఇతర దేశాలనుండి కొనుగోలు చెయ్యాల్సిన వైద్య పరికరాలూ, మందులూ వున్నాయి. చుట్టివేత వల్ల వాటిని మాకెవరూ సరఫరా చేసేవారు కాదు. ఫలితంగా ఐదు దొంతర్ల మధ్యవర్తుల ద్వారా వాటిని కొనాల్సివచ్చేది. అసలు ధరే ఎక్కువుంటే, మధ్య దొంతర్లతో మరింత ఖరీదయ్యేవి. అయినా తగిన సమయానికి అందేవి కావు. కనుక నాసిరకం వాటితోనే సరిపెట్టుకోవాల్సి వచ్చేది. మా ఆస్పత్రిలో 11 ఏళ్ల అమ్మాయికి హైడ్రొసెఫలి (తల ఉబ్బి పోవటం)కి 12 సార్లు శస్త్రచికిత్స చేయాల్సి వచ్చింది. మెదడుకు పెట్టిన ట్యూబులు నాసిరకానివి కావటంతో తరచుగా మార్చాల్సి వచ్చేది.

చుట్టివేత మమ్మలను ప్రత్యామ్నాయాల కొరకు వెతికేట్లు చేసింది. ఉదా॥సాగులో ఎరువులూ, చీడ మందులూ వాడేవాళ్లం కాదు. వరినాట్ల సమయంలో చిన్న చిన్న చేపలను వదిలివేవాళ్లం. అవి పొలం లోని పరాన్న భుక్కులను తినివేసేయి. అక్షరాస్యత కోసం మేమనుసరించిన పద్ధతులు, చుట్టివేతను దాటి ఇతర దేశాలకు చేరి పదిలక్షలమందిని అక్షరాశ్యులను చేశాయి. దాదాపు 30 వేలమంది క్యూబా వైద్యులు ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలలో పనిచేస్తున్నారు. ఇతర దేశాలకు చెందిన 84 వేలమంది వైద్యసిబ్బందికి క్యూబాలో శిక్షణ యిచ్చాం. చుట్టివేత లేకుండా వుంటే శాస్త్రజ్ఞానంలో మేమింకెంత అభివృద్ధి సాధించి వుండేవారమో. మానవాళికి ఇంకెంత సహాయపడి వుండేవారమో ఊహించుకోండి.

**పశ్న : క్యూబా ఔషధ పరిశ్రమో?**

**జవాబు :** మా ఔషధాలను మేమే తయారు చేసుకొనేందుకు వీలయినంత ప్రయత్నం చేస్తున్నాం. అయినా కొన్ని ముడిసరుకులనూ, పరికరాలనూ విదేశాలనుండి కొనాల్సి వుంటుంది. అదృష్టవశాత్తు, అవసరమైన కొన్ని ముడిసరుకులను కొనటంలో ఒక స్విట్జర్లాండు సంస్థ మాకు సహాయం చేస్తోంది. వాటిని జాగ్రత్తగా వాడుకుంటున్నాం. ఉదా: ఇబూప్రొఫెన్‌ను అమెరికాలో 800 మిల్లిగ్రాముల డోసుగా ఇస్తారు. మేము తెలుసుకున్నదేమంటే వైద్యానికి 200 మి.గ్రా.ల డోసు సరిపోతుందని. దీనితో ఎక్కువ టాబ్లెట్లుచేసి క్యూబాకేకాక, వెనిజులా, బొలీవియా, నికరాగువా దేశాలకు కూడా సరఫరా చేయగలిగాము.

అయినా ఇంకా ఇబ్బందులున్నాయి. కొన్ని సమయానికి అందవు. కొన్నిసార్లు ప్రపంచ మార్కెట్టులో కొనలేకపోతాము. చుట్టివేత చాలా సమస్యలు తెచ్చిపెడుతుంది. ఇటీవల వైద్య రంగంలో వచ్చిన 10 ఆవిష్కరణల్లో 8 అమెరికాలో పేటెంటు పొందాయి. అయినా ఫైడెల్ చెప్పినట్లు "ఒక బాలుడు క్యూబా ఆస్పత్రిలో చేరితే అతనికి అవసరమైన మందునందించటం వైద్యుని బాధ్యత. దానికవసరమైతే శ్వేతసౌధం తలుపులు తట్టాల్సి వచ్చినా సరే, బాలుడికి మందు అందించాలి". దీనికోసం చాలా శ్రమపడాలి. వివిధ దేశాలలోని సంఘీభావ ఉద్యమాలతో చుట్టివేతను కొంతమేరకు దాటగల్గుతున్నాం.

నేను పనిచేసే ఆస్పత్రిలో 8 నెలల పాప వుంది. అన్నవాహికలోని సిరలు వాచిపోయాయి. అవి నిరంతరం జీర్ణవాహికలోకి రక్తం కారుస్తుంటాయి. దీనికి వాడాల్సిన ఔషధం అమెరికాలో పేటెంటు అయింది. దానిని మాకమ్మేందుకు ఏ కంపెనీ సిద్ధంగా లేదు. అదృష్టవశాత్తూ అప్పుడే యూరపు లోని సంఘీభావ ఉద్యమం నుండి క్యూబాకు వచ్చి వున్నారు. వాళ్లను అడిగాం. వాళ్లు పంపించారు. పాపను కాపాడగలిగాం. మందుకొన్న డబ్బు తీసుకోనిరాకరించారు. మేమూ తీసుకోవాలని పట్టు పట్టాం. ఎందుకంటే అది డబ్బు సమస్యకాదు. చుట్టివేతవల్ల ఏర్పడిన సమస్యలకు ఇతరులపై ఆధారపడరాదన్నది మా విధానం. అందువల్ల శాస్త్రజ్ఞాన వృద్ధికి పాటుపడుతున్నాం. ఇతరులింకా పరిష్కరించజాలని సమస్యలకు పరిష్కారాలను వెతుకుతున్నాం.

**పశ్న : క్యూబాలో వైద్య పరిశోధన ఏ స్థితిలో వుంది? మీరు అలెర్జీలపై నిపుణులైన పిల్లల వైద్యురాలు. ఈ రంగంలో అభివృద్ధి జరిగిందా?**

**జవాబు :** ఈ రంగంలో క్యూబాలో చాలా పరిశోధన జరిగింది. శరీర రోగనిరోధక శాస్త్రమిది. దీనిలో అణుస్థాయి పరిశోధనాకేంద్రం వుంది. ప్రస్తుతానికి మేము మరణాత్మకమైన క్యాన్సరు, మధుమేహం, ఎయిడ్స్‌లపై కేంద్రీకరించాం. ఇక అలెర్జీలకు సంబంధించి, క్షేత్రస్థాయి పరిశోధనమీద కేంద్రీకరించాము. వీటికి మందుల వాడకాన్ని తగ్గించటానికీ, టీకాలను తయారుచెయ్యటానికీ ప్రయత్నిస్తున్నాము. అలెర్జీలకు టీకాలు బాగా పనిచేస్తున్నాయి. మాకున్న వాతావరణ పరిస్థితిలో 14 శాతం పిల్లలకు ఎలర్జీ వస్తున్నది గనుక ఈ రంగంలో విస్తృత పరిశోధనలు చేస్తున్నాము. చుట్టూ వున్న సముద్రంలోని వృక్షాల రకాలవల్లా, గాలిలో తేమ వల్ల పెరిగే ఫంగస్‌వల్లా అలెర్జీ లెక్కువ కనుక వీటిని నిరోధించే చర్యలపై కేంద్రీకరిస్తున్నాము.

గర్భిణీల విషయంలో అశాజనక కృషిచేశాము. గర్భం దాల్చగానే, కుటుంబ వైద్యుడు తల్లితో మాట్లాడి ఆమెకున్న అలెర్జీలను తెలుసుకొని, వాటికి కారణమైన వాటిని దరిచేరకుండా చూడమనీ, ఏ రకపు ఆహారం తీసుకోకూడదో, దుమ్ముపేరు కోకుండా

ఎలా చూడాలో చెబుతాడు. ఆవిధంగా తల్లులనుండి పిల్లలకు అలెర్జీలు రాకుండా చూసే ప్రయత్నంలో వున్నాం. ఆస్తమా పిల్లలకు ఈత నేర్పుతున్నాము. అందువల్ల వారికీ ఊపిరి పీల్చేశక్తి పెరుగుతుంది. ఉదరం చుట్టూ వుండే కండరాలు ఈతవల్ల బలపడటమేకాక వాటిమధ్య సమన్వయం పెరుగుతుంది. ఆస్తమా వచ్చినప్పుడు ఊపిరినీ తేలికగా తీసుకోగలుగుతారు. టీకాలూ, మందు లతోపాటు ఇలాంటివీ చేస్తున్నాం. ఈ రంగంలో పరిశోధనలకు చాలా వనరులు కావాలి. మేమింకా చేయాల్సింది చాలా వుంది. ప్రస్తుతానికి పరిస్థితి అదుపులోనే వుంది.

**పశ్న : ఐదేళ్లక్రితం నూతన ఆర్థిక నమూనాను ప్రవేశపెట్టారు. దానితో 50 లక్షల ఉద్యోగాలు ప్రవేటీకరించబడ్డాయి. ఈ కార్యక్రమం గురించి, దీనివల్ల తిరిగి పెట్టుబడిదారీ విధానంలోకి జారిపోయే ప్రమాదం గురించి చెబుతారా?**

**జవాబు :** సోవియటు యూనియను కుంగిపోయిన నాటినుండీ, ప్రపంచంలోని ఇతర ప్రాంతాల, ప్రత్యేకించి లాటిన్ అమెరికా ఆర్థిక యిబ్బందుల ప్రభావం క్యూబాపై ఎక్కువగా వుంటున్నది. దిగుమతులకు ప్రత్యామ్నాయాలు చూసినా, పర్యాటకం పెరిగినా ద్రవ్యలోటు తీవ్రంగా వుంటున్నది. సగటు కొనుగోలుశక్తి, వేతనాలలో వ్యత్యాసాలు పెరుగు తున్నాయి. బాగా పనిచేసిన వారికి వేతనాలు పెంచే విధానాన్ని అమలుచేస్తున్నాం. ఐదేళ్ల క్రితం ఆమోదించిన ఆర్థిక వాస్తవీకరణ కార్యక్రమం సారాంశం–అనుత్పాదక రంగాల పునర్నిర్మాణం. వాటిని సహకార సంఘాలుగా మార్చటం; కొంత ప్రైవేటీకరించటం. ఇది ప్రధానంగా ఇప్పటికే ఉనికిలోకి వచ్చిన వాటిని చట్టబద్ధం చేస్తున్నది. క్షురకులు, వడ్రంగం మొదలైనవి. వీరు ప్రైవేటుగానే పనిచేస్తూ ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండా కొందరిని పనిలో పెట్టుకుంటున్నారు.

ఇది సేవారంగానికే పరిమితం. ఉత్పాదక రంగంలో చాలా తక్కువ. ఆస్థి యాజమాన్యంలో కీలకమైన రంగాలేవీ దీని పరిధిలోకి రావు. విద్య, వైద్యం, రక్షణ రంగాల్లో ప్రైవేటీకరణే వుండదు. వైద్యం మానవహక్కు; వాణిజ్యం కాదు. విద్య అత్యవసరం. ఎందుకంటే అది లేకుండా స్వేచ్ఛా జీవనం వుండదు. మరొకవిధంగా వీటిని ఊహించ లేము. కనుక వాస్తవీకరణకు చాలా పరిమితులన్నాయి. క్యూబా, క్యూబా విప్లవం ఒక ప్రయోగశాల. ఇంతకు ముందు ఎదురుకాని సమస్యలు తలెత్తినప్పుడు వాటికి పరిష్కారాలను వెదుకుతున్నాం. ప్రస్తుతం చేస్తున్నదిదే. ఫలితాలను సమీక్షిస్తున్నాం. అవసరమైతే దిద్దుబాటు చేస్తున్నాం. రెండుమూడేళ్ల తర్వాత తప్పు చేశామనీ, మేమాశించిన విధంగా కార్యక్రమం పని చేయలేదనీ భావిస్తే, మళ్లీ వెనక్కి వెళ్లి సమస్యకు మరో పరిష్కారం వెతుకుతాం. ఇదంతా నేర్చుకునే క్రమమే.

**పశ్న: కమ్యూనిస్టు పార్టీ ఏడవ మహాసభలో రవుల్‌కాస్ట్రో ఒక చారిత్రక తరం మార్గదర్శకం యిస్తున్న చివరి మహాసభ యిదనీ, వీరు విప్లవ, సోషలిజం పతాకాలను నూతన తరాలకు అందిస్తారనీ అన్నారు. దేశ నాయకత్వంలో నూతన తరం ఎక్కడుంది? యువ సభ్యులు ఎక్కువగా వుండాలని మహాసభ చెప్పిందికదా?**

**జవాబు :** పార్టీ సభ్యత్వానికి కనీస వయసు 30 ఏళ్లు. తానున్న రంగంలో అతని కృషి సభ్యత్వానికి ప్రాతిపదిక. ఆ రంగంలోనివారే అతనిని ఎన్నుకుంటారు. మా పార్టీ ప్రజానీక పార్టీ కాదు. ఉత్తములనే ఎంచుకుంటుంది. విప్లవం నిర్దేశిత లక్ష్యాల నుండి వైదొలగకుండా ప్రజాధికారాన్ని కాపాడటం పార్టీ విధి. పార్టీలోకి ఎక్కువమంది మహిళలను సమీకరించేందుకు కృషి జరుగుతున్నది. మహిళా లేక పురుషుడా అన్నది కాదు; ఎవరు బాగా చేస్తారన్నదే పాటించాల్సిన అంశం. యువతలో కృషి ఇంకా జరగాలి.

**పశ్న : క్యూబా చుట్టివేతను ఎత్తివేసినా, సామ్రాజ్యవాదం వ్యతిరేక చర్యలను ఆపబోదు. ఐక్య వామపక్షమే పరిస్థితిని మార్చగలదని మీరు చెప్పారు. పశ్చిమ దేశాలలోని వామపక్షం క్యూబా విప్లవ రక్షణకు ఏం చెయ్యాలి?**

**జవాబు :** ఇంతవరకూ ఏం చేస్తున్నారో అదే. క్యూబాకు మద్దతుగా నిలవండి. దానిపట్ల గౌరవంతోనే ఇది ముఖ్యం. తాము జీవించని పరిస్థితులపై తీర్పు యివ్వకండి. విప్లవక్రమాన్ని నమ్మండి. అనుమానాలుంటే అడగండి. మేము జవాబిస్తాం.మేము తప్పులకు అతీతులంకాదు. పని మెరుగుపరుచుకోవటానికే చూస్తాం. ప్రస్తుతం చుట్టివేతకు వ్యతిరేకంగా పోరాడాలి. దానినెత్తివేయాలి. అయితే పశ్చిమ దేశాలలో వామపక్షాలు సమాజ మార్పు కొరకు ప్రజల మద్దతు పొందటం మరింత ముఖ్యమనుకుంటున్నాం. పెట్టుబడిదారీ వ్యవస్థను మార్చే దిశగా వామపక్షం పురోగమిస్తే కలిసి పరిస్థితిని మార్చగలం. మేం లేకుండా, మూడవ ప్రపంచ ప్రజలు లేకుండా మీరే సాధించగలమనుకుంటే పొరపాటు. అహాలను వదలి నిజమైన ఐక్యతను సాధిద్దాం. టెర్రరిజానికి సామ్రాజ్యవాదం నిధులు అందించటాన్ని ఎదిరించాలి. సిరియా ప్రజలపై దురాక్రమణకు పశ్చిమదేశాలదే ఆర్థిక సహాయం. దీనిని అనుమతించరాదు. మా దేశంలో దురాక్రమణలకు కుట్రలు సాగనివ్వరాదు. రెండు ప్రపంచ యుద్ధాలు జరిగాయి. మూడవది జరిగితే వినాశనమే. కనుక పశ్చిమ పెట్టుబడిదారీ దేశాల్లో వామపక్షం బలం పుంజుకోవాలి. ఈ వాస్తవాన్ని మార్చి మరో భిన్న ప్రపంచాన్ని సృష్టించాలి.

**పశ్న : క్యూబాలోనూ, బయటా మీరు తీరిక లేకుండా వుంటారు. గత కొన్ని నెలల్లోనే మూడుసార్లు యూరపు వచ్చారు. ఎలా చేయగలుగుతున్నారు?**

**జవాబు :** నా పనిలో ఎక్కువ విదేశీ ప్రయాణాలుం టున్నాయి. కనుక దేశంలో నా పనిలో కొంత క్రమబద్ధత లోపించింది. అందువల్ల పార్టీ మునిసిపల్ నాయకత్వ పదవి నుండి తప్పుకుని సామాన్య సభ్యురాలిగా వున్నాను. మిగిలిన కాలంలో పసిపిల్లల వైద్యురాలిగా గడుపుతాను. అదే నాకెక్కువ శక్తినిస్తుంది. విదేశాల నుండి రాగానే నేను మొదట వెళ్లేది వికలాంగ పిల్లల స్కూలుకే. వారిని మీరు చూడాలి. వారివి బలీయ వ్యక్తిత్వాలు. అలా నా బ్యాటరీని రీఛార్జి చేసుకుంటాను.

oooooo